క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



ఎర్రమాస్ పాల్‌కు పింఛన్ అందిస్తున్న సంపత్

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో 12వ క్లస్టర్ వలంటీర్‌గా పనిచేస్తున్న సంపత్ మానవత్వాన్ని ప్రదర్శించాడు. వార్డు పరిధిలోని పింఛన్‌దారుడు ఎర్రమాస్ పాల్‌కు డయాబెటీస్‌తో కాలు తొలగించడంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ సొంత ఖర్చులతో కడప రిమ్స్‌కు వెళ్లి బుధవారం అతనికి పింఛన్ అందించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ప్రొద్దుటూరు : ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి బుధవారం అనిబిసెంట్ హైస్కూల్‌లో ప్రచారం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించాలని ఆయన కోరారు.

టీచర్ నాగలక్ష్మికి అభినందనలు



టీచర్ నాగలక్ష్మీదేవిని అభినందిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి

చాపాడు : విద్యా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గణితాన్ని సులభంగా బోధించాలనే అంశంపై మండలంలోని మొర్రాయిపల్లె ప్రాథమిక పాఠశాల టీచర్ నాగలక్ష్మీ రూపొందించిన బేసిక్ మేథమ్యాటిక్స్ పర్మినెంట్ టీఎల్ఎం ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎర్రగుడి శ్రీనివాసులరెడ్డి బుధవారం టీచర్ నాగలక్ష్మీదేవిని అభినందించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా వృత్తి పట్ల టీచర్లకు ఉండే అంకిత భావం, నిబద్ధత ప్రశంసనీయమన్నారు. మరిన్ని ప్రాజెక్టులు విద్యార్థుల కోసం తీసుకు రావాలని ఆకాంక్షించారు.

నేడు వెదురూరులో వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేయనున్నట్లు తెలిపారు.

గ్రూప్-2 నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రూప్-2,3లకు సీపీటీని రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు పాత పద్ధతిని అమలు చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ నాయకులు గంగా సురేష్, దస్తగిరి, దేవా రాహుల్, చైతన్య పాల్గొన్నారు.

ఆప్‌కీ ఆవాజ్ నగర కమిటీ ఎన్నిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆప్‌కీ ఆవాజ్ నూతన నగర కమిటీని ఎన్నుకున్నట్లు ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా వెల్లడించారు. బుధవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నగర అధ్యక్షుడిగా సయ్యద్ అబిద్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా ముస్తాక్, నగర ప్రధాన కార్యదర్శిగా హైదర్‌తో పాటు పలువురిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీల ఐక్యత కోసం రాబోయే కాలంలో అన్ని వర్గాల ప్రజలను చైతన్య పరుచుకుంటూ ఉద్యమాలను చేపడతామని వివరించారు.

3,4 తేదీల్లో వైవీయూలో రీజినల్ క్విజ్ చాంపియన్‌షిప్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 3, 4 తేదీల్లో ప్రాంతీయస్థాయి క్విజ్ చాంపియన్‌షిప్-23 నిర్వహించనున్నట్లు వైవీయూ ఆంగ్లశాఖ సహ ఆచార్యులు, క్విజ్ చాంపియన్‌షిప్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.వి. జయంత్‌కశ్యప్, ఏపీ ఉన్నత విద్యామండలి క్విజ్ సమన్వయకర్త ఎం.రమేష్‌కుమార్ తెలిపారు. ఏపీ ఉన్నత విద్యామండలి మార్గదర్శకం మేరకు క్విజ్ పోటీలకు రాయలసీమ, నెల్లూరు జిల్లాలలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 33 టీంలు హాజరవుతున్నట్లు తెలిపారు. క్విజ్ పోటీలను ప్రిలిమ్స్, క్వాలిఫైయింగ్, క్వార్టర్ ఫైనల్స్‌గా మూడుదశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రీజినల్ స్థాయిలో విజేతలు ఏపీ ఉన్నతవిద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించే సెమీఫైనల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

జామియా మసీదు ఆస్తులను పరిరక్షిస్తా

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఖబరస్థాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలో ప్రముఖమైన జామియా మసీదు ఆస్తులను పరిరక్షించేందుకు ప్రభుత్వానికి లేఖ రాస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక జామియా మసీదుతోపాటు ఖబరస్థాన్‌ను బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ప్రముఖులు పలు సమస్యలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జామియా మసీదుకు సంబంధించి పెద్ద మొత్తంలో ఆస్తులు ఉన్నాయని, సర్వే చేయించి పూర్తి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఖబరస్థాన్‌లో లైట్లు వేయించడంతోపాటు సిమెంటు రోడ్డు నిర్మిస్తామన్నారు. మసీదులో రంజాన్ సందర్భంగా ప్రతి రోజు ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వద్ద ఖలీల్, కమాల్‌బాషాతోపాటు మైనారిటీ నాయకులు ఖాజామొహిద్దీన్, వద్ద దాదాపీర్, నూరి, హనీఫ్, సుభాన్ బాషా, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ అక్రమ్, హిదాయత్, అహ్మద్, కరీముల్లా, జాకీర్, హాజీ పీరా, జబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లుకు సన్మానం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే మొదటగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేసిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 213 రోజులపాటు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఎంతో మందికి ఎమ్మెల్యే సొంత డబ్బుతో సాయం అందించారన్నారు. రాష్ట్రంలోని ప్రథమ స్థానంలో నిలవడం ప్రొద్దుటూరు నియోజకవర్గానికే గర్వకారణమని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిసెట్టి బాబు, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

ఆర్డీఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు : చౌకదుకాణాల బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై ప్రత్యేక నిఘా ఉంచాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బియ్యం నిల్వలు, రవాణాపై నిఘా ఉంచామని తెలిపారు. అనుమానం వచ్చిన ఇళ్లను, వాహనాలను నిలిపి తనిఖీ చేయాలని సూచించారు. బియ్యం అక్రమ రవాణాతోపాటు నిల్వ ఉంచిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమాచారం ఇచ్చిన వారిని వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్ ఎన్నిక



కడప ఎడ్యుకేషన్ : ఒంగోలు వేదికగా ఫిబ్రవరి 26,27,28 తేదీల్లో జరిగిన 8వ రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా కడప జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి గారికి, ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యూటీఎఫ్ నాయకుల ధర్నా

కడప ఎడ్యుకేషన్ : ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో విద్యాశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వినతిపత్రాలు ఇవ్వడానికి వచ్చిన యూటీఎఫ్ నాయకులపై డీఈఓ దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఇందుకు నిరసనగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శులు రమణ, అహమద్, నాయకులు కరీముల్లా, గోపీనాథ్, కిరణ్‌కుమార్, దేవదత్తం, సూర్యకుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రికెట్‌పై అవగాహన

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులకు క్రికెట్‌పై అవగాహన కల్పించారు. బుధవారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఉమన్ వింగ్ కో-ఆర్డినేటర్ విష్ణుమోహన్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థినులకు క్రికెట్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్. సాజిత్ పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సు

బద్వేలు అర్బన్ : ఈనెల 7వ తేదీన హోలీ పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో జరిగే గిరి ప్రదర్శనకు బద్వేలు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ రాత్రి 8 గంటలకు పోరుమామిళ్ల బస్టాండు నుంచి బయలుదేరే ఈ ప్రత్యేక బస్సు బద్వేలులో రాత్రి 9 గంటలకు మళ్ళీ బయలుదేరుతుందని, 7వ తేదీ ఉదయం 5 గంటలకు తిరువణ్ణామలై (అరుణాచలం)కు చేరుకుని గిరి ప్రదర్శన తర్వాత అదే రోజు రాత్రి 9 గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరుతుందని తెలిపారు. కావున బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక బస్సుకు బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్‌లో గాని, ఆన్‌లైన్ ద్వారా గాని ముందస్తు రిజర్వేషన్ చేయించుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు బద్వేలు డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పశు విజ్ఞానబడి సందర్శన



పశువులకు టీకాలు వేయిస్తున్న డాక్టర్ శ్రీనివాసులరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని దాసరిపల్లెలో బుధవారం నిర్వహించిన పశువిజ్ఞాన బడిని జిల్లా పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మండల వెటర్నరీ అధికారులకు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలో ప్రబలుతున్న గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పించి పశువులకు ముందస్తుగా గాలికుంటువ్యాధి నివారణకు టీకాలు వేయించారు. అనంతరం ఆయన టేకూరుపేట వెటర్నరీ ఆసుపత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట పశువైద్యులు డాక్టర్ శివశ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆదరిద్దాం

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత



కడపలోని ప్రభుత్వ బాలుర గృహంలో సిబ్బందితో మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప అర్బన్ : తల్లిదండ్రులను, వృద్ధులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి కుటుంబసభ్యునికి ఉందని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత అన్నారు. బుధవారం నగర శివార్లలోని చౌడమ్మ వృద్ధాశ్రమాన్ని జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011 ను అవగాహన చేసుకోవాలనీ వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ, కడప వారి దృష్టికి తీసుకురావచ్చన్నారు.

- కడపలోని ప్రభుత్వ బాలురగృహంను జడ్జి సందర్శించారు. పిల్లలకు అందుతున్న వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. జాతీయ న్యాయసేవాధికారసంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం-2015 గురించి వివరించారు. ప్రభుత్వ బాలుర గృహం సూపరింటెండెంట్, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ఆపస్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షులు భోగుల వెంకట్రామిరెడ్డి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, ఆపస్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఈనెల 5,6 తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆపస్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు పోగుల వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లు, సిక్కర్లను బుధవారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్ ఆపస్ నాయకులతో కలిసి విడుదల చేశారు. జిల్లా మీడియా ఇన్‌చార్జి బాలకృష్ణుడు, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వక్తృత్వ, వ్యాసరచన, డిబేట్ పోటీలు

కడప కల్చరల్ : రెడ్డి సేవా సమితి కడపశాఖ ఆధ్వర్యంలో మహిళలకు వక్తృత్వ, వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించనున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. ఈనెల 11న రాజీవ్‌మార్గ్‌లోని తమ కార్యాలయంలో ఈ పోటీలు నిర్వహించనున్నామని వివరించారు. కడప నగరానికి చెందిన డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొనాలని కోరారు. వక్తృత్వ పోటీలో ఒకప్పుడు భారతదేశం ప్రపంచ శక్తిగా వెలుగొందినది-భవిష్యత్తులో మరలా ప్రపంచ శక్తిగా మారగలదా అది ఎలా? అనే అంశంపై మాట్లాడాల్సి ఉంటుందని, వ్యాసరచనను విలువలతో కూడిన విద్య అంశంపై రాయాల్సి ఉంటుందన్నారు. డిబేట్ పోటీల్లో నేటి సామాజిక మాధ్యమాలు-మానవునికి వరమా? శాపమా? అనే అంశంపై పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇద్దరు కలిసి ఒక జట్టుగా పాల్గొనాలని, ఒకరు అనుకూలంగా, మరొకరు ప్రతికూలంగా మాట్లాడాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 5లోగా తమ పేరు, కళాశాల, సెల్ నెంబరు, పోటీ చేసే అంశం తదితర వివరాలతో 94406 51284 లేదా 94405 23484 నెంబర్లలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలు కేవలం మహిళలకు మాత్రమేనని, ఆసక్తిగల వారు తమ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన లెటర్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. వ్యాసరచనకు 40 నిమిషాలు, వక్తృత్వ పోటీ, డిబెట్‌లకు నాలుగు నిమిషాల సమయం ఇస్తామని, మార్చి 12న బహుమతి ప్రదానం ఉంటుందని వివరించారు.

మాదకద్రవ్యాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ గోవిందనాయక్

బద్వేలు అర్బన్ : విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్.గోవిందనాయక్ తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని కళాశాల బాలుర వసతిగృహంలోని విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై ఆయన 1అవగాహన కల్పించి మాట్లాడారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల వాడకం వలన యుక్తవయస్సులో శక్తి నిర్వీర్యం అవడంతో పాటు ఆలోచన విధానం సన్నగిల్లడం, చదువుపై ధ్యాస తగ్గడం వంటివి ఏర్పడతాయని తెలిపారు. మొదటిసారేలే.. ఒకసారి తీసుకుంటే ఏమవుతుందిలే అని సరదాగా మత్తుకు అలవాటై చివరికి మత్తు నుంచి బయటపడలేక నిండు జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైతే చివరకు కుటుంబ బాంధవ్యాలు దూరమవుతాయన్నారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండి లక్ష్యం దిశగా అడుగులు వేయాలని కోరారు. అలాగే ఎక్కడైనా మత్తుపదార్థాలు గాని, మాదకద్రవ్యాలు గాని గుట్టుగా విక్రయిస్తుంటే ఎస్‌ఈబీ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.మురళీమోహన్, వసతిగృహం సంక్షేమాధికారి సుభాష్‌చంద్ర, ఎస్‌ఈబీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాతర బృందం

కలసపాడు : మండలంలోని ఎగువరామాపురం గ్రామంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎగువరామాపురం బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో బుధవారం తులసికళ్యాణ్ ఫోక్ ఆర్ట్ కళాజాతర బృందం వారి చేత ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా అందుబాటులో ఉన్న సేవలు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం, మెసేజ్ అలర్ట్ వంటి అధునాతన సేవల గురించి వివరించి వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. ఏటీఎం కార్డులు కావాల్సిన వారు బ్యాంకు నుంచి వెంటనే పొందవచ్చన్నారు. బ్యాంకు ఇన్సూరెన్స్, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన వంటి పథకాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు ఆఫీస్ అసిస్టెంట్ బి.సులోచన, బ్యాంకు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ



సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : నూతన సబ్‌స్టేషన్ నిర్మాణంతో విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. కూనవారిపల్లె గ్రామానికి నూతన సబ్‌స్టేషన్ మంజూరు అయింది. బుధవారం సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటుతో కూనవారిపల్లె పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ కనపర్తి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ రాముడు తదితరులు పాల్గొన్నారు.

అంధులకు సేవ దైవ కార్యం



అంధులకు నగదు అందచేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

ప్రొద్దుటూరు కల్చరల్ : అంధులకు సేవ చేయడం దైవకార్యమని చిన్న పిల్లల వైద్యనిపుణుడు పీవీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక రాయలసీమ ఫర్నిచర్స్ వద్ద బుధవారం గాజులపల్లె పెద్ద సుబ్బయ్య పెద్ద సుబ్బమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో 44 మంది అంధులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధులకు సంస్థ ఆధ్వర్యంలో రూ.200లు పింఛన్ ఇవ్వడం అభినందనీయమన్నారు. సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను కొనియాడారు. ఎస్‌బీఐ ఉద్యోగి వరదరాజులు, పబ్బతి శ్రీరాములు, సుబ్బరాయుడు, భక్తాపెంచలయ్య అంధులకు, సుబ్బరత్నమ్మ, శ్రీనివాసులు తమ వంతు సాయం చేశారు. సంస్థ అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రుడు, విశ్రాంత ఉద్యోగులు గురప్ప, గోవిందరాజులు, రహమాన్, సుబ్బరాయుడు, నరసింహులు, శివభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వికాస్ విహార్, మానవతా కార్యాలయంలో..

స్థానిక రామేశ్వరంలోని వికాస్ విహార్ మానసిక దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 50 మంది చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.400లను దాతలు సన్నుతి శ్రీనివాసులు, శేషగిరిరావు పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లపేట సరస్వతీ విద్యా మందిరంలోని మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో సన్నుతి శ్రీనివాసులు, ముత్యాలపాటి శేషగిరిరావు, నాగరాజు, జగదీశ్వర్‌లు అంధులకు సాయమందించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ కళావతి, అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల తీరు దుర్మార్గం

టీడీపీ నాయకుల చేతిలో గాయపడిన అగ్గారపు శ్రీనుకు ఎమ్మెల్యే పరామర్శ



అగ్గారపు శ్రీనివాసులును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : మాజీ కౌన్సిలర్, 33వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, పద్మశాలీయ సంఘం పట్టణాధ్యక్షుడైన అగ్గారపు శ్రీనివాసులుపై టీడీపీ నాయకులు దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శ్రీనివాసులుతో పాటు వారి ఇంట్లోని మహిళలను విచక్షణా రహితంగా కట్టెలతో కొట్టడం శోచనీయమని ఎమ్మెల్యే తెలిపారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో 33వ వార్డు టీడీపీ కౌన్సిలర్ శివజ్యోతి భర్త కుతుబుద్దిన్ తన అనుచరులతో కలిసి దాడి చేసిన సంఘటనలో అగ్గారపు శ్రీనివాసులు గాయపడ్డారు. చికిత్సనిమిత్తం ఆయనను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే రాచమల్లు బుధవారం జిల్లా ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. శ్రీను ఆరోగ్యం గురించి వైద్యులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. టీడీపీ కౌన్సిలర్ భర్త, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడైన కుతుబుద్దిన్ మంగళవారం రాత్రి 20 మంది అనుచరులతో కలిసి అగ్గారపు శ్రీనివాసులు ఇంటిపై దాడి చేశారన్నారు. వార్డులో అభివృద్ధిని ఓర్చుకోలేక శ్రీనివాసులు, వారింట్లోని ఆడవాళ్లపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో శాంతి లేకుండా ఎవరు చేస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడికి పాల్పడ్డవారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసే కుట్ర


రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న



మాట్లాడుతున్న తిమ్మన్న

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్ర ప్రభుత్వం చేస్తోందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న ఆరోపించారు. కడపలోని ఎస్టీయూభవన్‌లో బుధవారం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ బకాయిలు, కరువుభత్య బకాయిలు, భవిష్యనిధి, జీవితబీమా బకాయిలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రతి నెల 1న జీతాలు చెల్లించకుండా 15వ తేదీ వరకు వేచి ఉండాల్సి వస్తుందన్నారు. దీంతో వ్యక్తిగత రుణాలు, నెలవారి వాయిదా చెల్లింపులకు బ్యాంకులకు పెనాల్టీ కట్టాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్య ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వచ్చిన తరువాత ప్రాంతీయ విద్యాధికారులు, జిల్లా విద్యాశాఖ దాడులు ఎక్కువయ్యామని ఆరోపించారు. ప్రభు త్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు అశోక్, ప్రకాసం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అప్పన ఏడుకొండలు, ఉమాపతి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకుడు కరుమూరు వెంకట రమణయ్య మృతి



ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవకుడు, చైతన్య సాంఘిక సేవా సంఘం అధ్యక్షుడు కరుమూరు వెంకట రమణయ్య మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, బీసీ నాయకుడిగా సేవలందించారు. చైతన్య సాంఘిక సేవా సంఘం ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తకాలు, పేదలకు దుప్పట్లు, వస్త్రాలను అందించేవారు. రామేశ్వరంలోని రమణయ్య స్వగృహంలో ఆయన మృతదేహానికి రచయిత జింకా సుబ్రహ్మణ్యం, సీపీ సాధు గోపాలకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు భాస్కరరాజు, సత్యనారాయణ తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

వంట గ్యాస్ ధరల పెంపు సరికాదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వంట గ్యాస్ వినియోగదారులపై అధిక ధరలను పెంచి భారాలు మోపడం తగదని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్‌పై రూ. 50 పెంచడం దుర్మార్గమన్నారు. బీజేపీ ప్రభుత్వం అన్ని రకాల ధరలను పెంచి సామాన్య ప్రజానీకాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోందని ధ్వజమెత్తారు. ఇప్పటికేఅసంఘటిత కార్మికులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు రోజు రోజుకు పెరుగుతున్న భారాలను భరించలేని స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రా రెడ్డి, ఓబులేసు, ఎంఆర్ నాయక్ పాల్గొన్నారు.